క్లుప్తంగా

27న వాహనాల వేలం

ఆలూరు రూరల్: జిల్లా సెబ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను ఈ నెల 27వ తేదీ వేలం వేస్తున్నట్లు ఆలూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సోమశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 15 స్కూటర్లు, 1 స్కార్పియో, 1 టాటా ఏస్ ట్యాలీ ఆటో వేలానికి ఉంచినట్లు తెలిపారు. ఆసక్తిగల వారు రూ.3 వేలు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. స్థానిక సెబ్ పోలీసుస్టేషన్ ఆవరణలో 27న ఉదయం 10 గంటలకు వేలంపాట ఉంటుందని వెల్లడించారు.

ట్యాంకర్లతో మంచి నీటి సరఫరా

ఆస్పరి: మండలంలో నీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాల్లో మార్చి 1వ తేదీ నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో తొగలుగల్లు, తురువగల్లు, డీ.కోటకొండ, గార్లపెంట, బైలుపత్తికొండ, పుప్పాలదొడ్డి, జోహరాపురం, చిన్నహోతూరు, తంగరడోణ, దొడగొండ, ఐనకల్లు, అట్టికల్లు గ్రామాల్లో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉందని జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. జిల్లా అధికారుల అదేశాలు మేరకు 12 గ్రామాల్లో మార్చి 1వ తేదీ నుంచి వేసవి ముగిసే వరకు ట్యాంకర్లతో మంచి నీటిని సరఫరా చేస్తామని చెప్పారు.

‘చీకటి వెలుగులు’ పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

ఆలూరు రూరల్: కళానికేతన్ సాహితీ సంస్థ అధ్యక్షులు ఈరన్న రచించిన చీకటి వెలుగులు 69వ పుస్తకాన్ని బాలబంధు గద్వాల సోమన్న అధ్యక్షతన రిటైర్డ్ తహసీల్దార్ షేక్షావలి, రిటైర్డ్ ఎంఈఓ రామలింగమ్మ చేతుల మీదుగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని రామలింగమ్మకు అంకితం ఇచ్చారు. ఈ సందర్భంగా వక్తలు తెలుగు భాషా పరిరక్షణ ఆవశ్యకతపై సందేశాన్నిచ్చారు. గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు, భాస్కర్, ఈశ్వరప్ప, రంగన్న, నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

హాలహర్వి: మండలంలో ప్రసిద్ధిగాంచిన గూళ్యం గాదిలింగేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా ఆదివారం క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వాహకులు ప్రారంభించారు. ఇందులో ఆరు జట్లు పాల్గొన్నాయి. విజేతలకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు చొప్పున అందజేయనున్నట్లు మేనేజ్‌మెంట్ గౌస్, దాసరి మురళి తెలిపారు. మార్చి 14న ఫైనల్ మ్యాచ్ ఉంటుందని చెప్పారు.


వైభవంగా శివాభిషేకం



వెంకటసాయి దేవాయంలో శివాభిషేక వేడుకలు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక అన్నమయ్య సర్కిల్లోని వెంకటసాయి దేవాలయంలో గురుస్వామి భవానీశంకర్ ఆధ్వర్యంలో శివస్వాములు ఆదివారం శివాభిషేక వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని లింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివపార్వతులకు పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పంచామృతంతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నిండుకుండలా దేవనకొండ చెరువు



చెరువులో పుష్కలంగా ఉన్న నీరు

దేవనకొండ: హంద్రీ – నీవా కాలువకు దేవనకొండ మీదుగా నీరు ప్రవహించడం వల్ల స్థానిక చెరువు నిండుకుండలా మారింది. గత నాలుగు సంవత్సరాల నుంచి హంద్రీ – నీవాకు నీరు వస్తున్నాయి. నది నుంచి దేవనకొండ చెరువుకు నీరు రావడంతో చుట్టుపక్కల దాదాపు 5 కి.మీ వరకు భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

28 నుంచి ఉరుసు

దేవనకొండ: మండలంలోని కొత్తపేట గ్రామంలో వెలిసిన మస్తాన్‌వలి స్వాముల వారి ఉరుసు ఈనెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. 28న గంధం, 29న ఉరుసు, మార్చి 1న జియారత్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు మంచినీరు, అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దర్గాలో ప్రతి అమావాస్య, ప్రతి గురువారం అన్నదాన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

‘పది’కి పక్కా ప్రణాళిక

- టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఉదయం, సాయంత్రం సబ్జెక్టుల వారీగా బోధన
- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయుల కృషి



విద్యార్థులకు స్టడీహవర్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

గోనెగండ్ల: పదో తరగతి పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. దీనికి అనుగుణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్నద్ధం అవుతున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులకు మెలకువలు నేర్పుతున్నారు. ఈ సంవత్సరం పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మాక్ టెస్టులతో అవగాహన

నూతన విధానాన్ని అనుసరించి ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, ఉత్తమ ఫలితాల కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, మాక్ టెస్టులు నిర్వహిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ

టెన్త్‌లో మెరుగైన ఫలితాల సాధనకు జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టారు. డీఈఓ, ఎంఈఓ, హెచ్‌ఎంలు తరగతులను పర్యవేక్షిస్తున్నారు.

ప్రత్యేక ప్రణాళికతో ముందుకు

ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తమ ఫలితాల సాధన కోసం విద్యార్థులు తమ వంతు ప్రయత్నం చేస్తున్నా వారిలో కొంత భయం, ఆందోళన ఉండడం సహజం. ఒత్తిడిని అధిగమించేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేకంగా పాఠాలు బోధిస్తున్నారు. మండలంలో 7 హైస్కూళ్లు, వీటితో పాటు ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు ఉన్నాయి. మొత్తం ఆయా పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 591 మంది ఉన్నారు. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని అధికారులు తెలిపుతున్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధిస్తాం



ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి వంద శాతం ఉత్తీర్ణత సాధించి తీరుతాం. అందుకు తగ్గట్టుగా బోధన చేస్తున్నాం.

– నాగభూషణం, హెచ్‌ఎం, గోనెగండ్ల

పరీక్షలంటే భయం పోయింది



ప్రత్యేక తరగతుల వల్ల పరీక్షలపై ఆత్మ విశ్వాసం పెరుగుతోంది. ఇప్పటికే చదివిన అంశాలు రివిజన్ చేసుకుంటున్నాం. పరీక్షలంటే భయం పోయింది. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా చదవడానికి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. అలాగే మానసిక ఒత్తిడి లేకుండా చర్యలు చేపడుతున్నారు.

– జి. చిన్నకేశమ్మ, పదో తరగతి విదార్థిని, జెడ్పీహెచ్‌ఎస్, గోనెగండ్ల

మెరుగైన ఫలితాల సాధనకు కృషి



మండలంలో పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా సిబ్బంది, అందరం కష్టపడుతున్నాం. ఇందుకోసం నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాము. విద్యార్థులు తెలియని పాఠ్యాంశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలి. భయం వీడి ధైర్యంగా పరీక్షలకు సన్నద్ధం కావాలి.

– రామాంజనేయులు, ఎంఈఓ, గోనెగండ్ల

విరుపాపురం చెరువులో పూడికతీత



పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న నాయకులు

హాలహర్వి: మండలంలోని విరుపాపురం గ్రామ చెరువులో పూడికతీత పనులను ఆదివారం ఎఫెర్ట్ బయార్ కంపెనీ (ఎఫర్ట్ డీకేఏ ఆస్ట్రియా) ఆధ్వర్యంలో స్థానిక నాయకుడు మల్లికార్జున ఆధ్వర్యంలో చేపట్టారు. సకాలంలో వర్షాలు కురిస్తే చెరువులో నీటి నిల్వ పెరుగుతుందన్నారు. చెరువులో నీరు నిల్వ ఉంటే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ప్రభుత్వం చెరువుల్లో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పరామర్శ

గోనెగండ్ల: స్థానిక ఉప్పరి వీధికి చెందిన షేక్ అహమ్మద్‌ను వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతుల్, యూత్ అధ్యక్షుడు బందెనవాజ్ తదితరులు పరామర్శించారు. షేక్ అహమ్మద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయాలు తెలుసుకొని ధైర్యం చెప్పారు. నాయకులు దొరబాబు, మాబువలి, నాయుడు, చికెన్ రాజా తదితరులు ఉన్నారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ మేలు



వందవాగిలిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బి.విరూపాక్షి

హొళగుంద: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ మేలు జరిగిందని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బసినె విరూపాక్షి అన్నారు. ఆయన ఆదివారం మండల పరిధిలోని గజ్జహళ్లి, వందవాగిలి గ్రామాలలో విస్తృతంగా పర్యాటించారు. ఆయనకు నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో చెప్పుకోవడానికి ఏ ఒక్క సంక్షేమ పథకం లేదని, అలాంటి వారు ప్రస్తుతం ఎన్నికలు దగ్గర పడ్తున్న వేళ కల్లిబొల్లి మాటలతో మీ ముందుకొస్తున్నారని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. చంద్రబాబు పాలనంతా దోచుకోవడం.. దాచుకోవడం మాత్రమేనని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఏ గ్రామం చూసినా కొత్త రూపు తెచ్చుకున్న పాఠశాలలు, సచివాలయాలు, ఆర్బీకేలు, ఆస్పత్రులు, 108, 104 అంబులెన్సులతో పాటు కుల, మతం, పార్టీలు చూడకుండా ఇంటింటికీ అందుతున్న సంక్షేమ పథకాలే కనబడుతున్నాయన్నారు. ప్రజలు చంద్రబాబు, జగనన్న పాలన మధ్య తేడాను గమనించాలని, రాష్ట్రం, ప్రజలు బాగుపడాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా, నాయకులు ఈశా, దొడ్డబసప్ప, కోగిలతోట శేషప్ప, కెంచప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయం కోసం శ్రమిద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ నెట్టికంటమ్మ

హాలహర్వి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు శ్రమిద్దామని ఎంపీపీ నెట్టికంటమ్మ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆమె స్థానిక ఎంపీపీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందారన్నారు. ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో ప్రజలకు తెలియజేసి వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో పర్యటించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. ఎంపీటీసీ గోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు నగేష్, సర్పంచ్ సద్దాం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్–2 ప్రిలిమినరీ పరీక్ష



ఎమ్మిగనూరులో పరీక్షా కేంద్రం వద్ద బోర్డుపై నంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు



ఎమ్మిగనూరులో అభ్యర్థుల ఆధార్ కార్డు, హాల్ టికెట్లను సరుచూస్తున్న సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, బీఈడీ కళాశాలలు తదితర 16 కేంద్రాల్లో ఏర్పాటు చేసిన గ్రూప్–2 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 4411 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా కొందరు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అక్రమాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోగా పరీక్షా కేంద్రాల వద్ద పట్టణ సీఐ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

దేవనకొండ: మండల కేంద్రంలో కార్మికులు ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగు కాలువలను శుభ్రం చేసి చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. పంచాయతీకి కేటాయించిన ట్రాక్టర్లలో చెత్తను తరలించి ఊరి చివరన డంప్ చేస్తున్నారు. ప్రతి వీధి శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు సచివాలయ అధికారులు తెలిపారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

హొళగుంద: దసరా బన్ని ఉత్సవాలకు ప్రసిద్ధి చెందిన దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి విరాట్‌మూర్తులకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని దర్శించుకోవడానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలో మూల విరాట్‌మూర్తులకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

మద్దికెర: మద్దమాంబ రథోత్సవం సందర్భంగా మద్దికెరలో ఆదివారం నిర్వహించిన వృషభాల బండలాగుడు పోటీలను పత్తికొండ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. రసవత్తరంగా సాగిన పోటీల్లో నంద్యాల జిల్లా యస్.కొత్తూరుకు చెందిన బీరం బుల్స్, బీరం సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి వృషభాలు మొదటి, ద్వితీయ బహుమతి రూ.60 వేలు, రూ.40 వేలు గెలుచుకున్నాయి. అనంతపురం జిల్లా సోమలదొడ్డి, పెద్దవడుగూరుకు చెందిన వృషభాలు రూ.30 వేలు, కర్నూలు జిల్లా పగ్గిడాల గ్రామం కోరల గిరజ వృషభాలు రూ.20 వేలు, అనంతపురం జిల్లా యంగణపల్లె శశికళ వృషభాలు రూ. 10 వేలు, కర్నూలు జిల్లా పులికొండ రంగస్వామినాయుడు వృషభాలు రూ.5 వేలు గెలుచుకున్నాయి. నిర్వాహకులు శ్రీనివాసులు, కిట్టి, ఖాజావలి వృషభాల యజమానులకు బహుమతులను అందజేశారు. పోటీలను తిలకించానికి వచ్చిన వారికి గ్రామానికి చెందిన నాగేష్, కిట్టి అన్నదానం చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

దేవనకొండ: మండలంలోని రిజర్వ్ ఫారెస్టులో వెలిసిన కొలుట్ల చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం చైర్మన్ హనుమంత రెడ్డి, ఈఓ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టారు. హుండీలో భక్తులు సమర్పించిన కానుకలు రూ.3,54,830, కల్యాణం చదివింపులు రూ.9,540, బ్రహ్మోత్సవాల చదివింపులు రూ.1,57,680, సేవా టికెట్ల విక్రయం ద్వారా రూ.50,725, షాపుల కలెక్షన్ రూ.21,870 వచ్చిందన్నారు. మొత్తం రూ.5,94,645 ఆదాయం వచ్చిందని, ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఖర్చు చేస్తామని ఈఓ చెప్పారు. ఆలయ తనిఖీ అధికారి వెంకటేశ్వర్లు, పోలీసులు, దేవాలయ సిబ్బంది, పండితులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ ట్యాంకులకు నీరు మళ్లింపు



ఎల్లెల్సీ నీటిని బాపురం ఎస్ఎస్ ట్యాంకుకు పంపింగ్ చేస్తున్న దృశ్యం

హాలహర్వి: ప్రజల తాగునీటి అవసరాల కోసం తుంగభద్ర డ్యాం బోర్డు అధికారులు ఎల్లెల్సీ కాలువకు నీటిని విడుదల చేశారు. ఇందులో భాగంగా ఆదివారం మండలంలోని బాపురం, చింతకుంట, విరుపాపురం గ్రామాల్లోని ఎస్ఎస్ ట్యాంకులను నీటితో నింపుతున్నారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు తగినంతగా నీటిని సరఫరా చేస్తామని ఎల్లెల్సీ కాలువ అధికారులు తలిపారు.

భక్తిశ్రద్ధలతో షబ్ ఏ బరాత్

వెల్దుర్తి(కృష్ణగిరి): ఇస్లాం క్యాలెండర్ ప్రకారం రంజాన్ నెల ముందు వచ్చే షాబాన్ నెల 15వ రోజు శుభప్రదంగా జరుపుకునే షబ్ ఏ బరాత్ (పెద్దరాత్రి)ను ఆదివారం మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం బడాదిన్, ఆదివారం బడీరాత్‌గా రెండ్రోజులు ఉపవాస దీక్షలు నిర్వహించారు. బడీరాత్ పురస్కరించుకుని ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు అన్ని మసీదులు, ఇళ్లలో ప్రత్యేక నమాజులు నిర్వహించారు. పాపవిముక్తి, మోక్షం, శుభ రేయిగా భావించి అల్లాహ్ కృప కోసం రేయంతా జాగరణతో ప్రార్థనలు నిర్వహించి దువా చేశారు. మతపెద్దల బోధనలు సాగాయి.

గోశాలకు విరాళం

ఆదోనిఅర్బన్: ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి గోశాలకు ఆదోనిలోని శ్రీగురుకృప కూచిపూడి నాట్యాలయ చిన్నారులు ఆదివారం రూ.20,400 విరాళం అందించారు. ఈ సందర్భంగా నాట్యాలయ గురువు వీరజ్‌రాయల్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీని పోగుచేసి గోశాలకు విరాళం అందజేయడం అభినందనీయమని తెలిపారు. చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు, గోశాల సభ్యులు రుద్రయ్యస్వామి, చిన్నవీరేష్, నాగేష్, గోపాల్ పాల్గొన్నారు.

దస్తగిరి స్వామి ఉరుసు

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దర్గాలో స్వామి వారికి భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్గాను దర్శించుకున్నారు.

సేవాదళ్ సభ్యులకు వంటగ్యాస్ సబ్సిడీ



సబ్సిడీ విడుదల చేస్తున్న పి.మురళీధర్‌రెడ్డి

పత్తికొండ రూరల్: సీఎం జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా సేవాదళ్ సంస్థ కుటుంబ సభ్యులకు కానుకగా రూ.2 లక్షల వంట గ్యాస్ సబ్సిడీని ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి విడుదల చేశారు. స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఒక్కో కుటుంబానికి రూ.200 చొప్పున లబ్ధిదారులకు నగదు అందించారు. సేవాదళ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

చురుగ్గా మార్లమడికి రోడ్డు నిర్మాణం



నేడు – హొళగుంద-మార్లమడికి డబుల్‌రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం



నాడు – అధ్వానంగా ఉన్న రోడ్డు

హొళగుంద: కర్ణాటక సరిహద్దులో జిల్లా కేంద్రానికి ఓ మూలన విసిరేసినట్లున్న హొళగుంద–మార్లమడికి రోడ్డు కొత్త రూపు తెచ్చుకుంటోంది. ఎన్నో ఏళ్లుగా అధ్వానంగా ఉన్న ఈ రోడ్డులో గత వారం రోజులుగా నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. హొళగుంద–మార్లమడికి రోడ్డు 5.10 కి.మీకు గాను రెండు లైన్ల రహదారి (వాల్మీకి సర్కిల్ నుంచి ఎల్లెల్సీ కాలువ ముందు వరకు డబుల్ సీసీ రోడ్డు, అక్కడి నుంచి తారు రోడ్డు) నిర్మించేందుకు రూ.5.40 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆంధ్ర–కర్ణాటక రాష్ట్రాలకు వారధిగా ఉన్న మార్లమడికి రోడ్డు గోతులు పడి అధ్వానంగా మారగా గత టీడీపీ పాలనలో నాయకులు అదిగో నిధులు.. ఇదిగో రోడ్డు అంటూ పబ్బం గడుపుకున్నారు. ఐదేళ్ల మాటలతోనే కాలం గడిపేశారు. దీంతో ఈ రోడ్డులో నిత్యం ప్రయాణికులు నరకాన్ని అనుభవిస్తున్నారు. అడుగడుగునా గతుకులు, భారీ గుంతలతో అధ్వానంగా మారిన ఈ రోడ్డులో ప్రయాణం నరకాన్ని చూపిస్తోంది. ఐదు కిలోమీటర్ల దారి ప్రయాణం అరగంటకు పైగా సమయం తీసుకుంటుందంటే రోడ్డు పరిస్థితి ఏ మేరకు ఉంటుందో ఊహించుకోవచ్చు. ఎట్టకేలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిధులు మంజూరుచేయడంతో రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొద్ది నెలల్లో పనులు పూర్తయ్యే అవకాశాలున్నాయి.

విజేత గుంటూరు జిల్లా వృషభాలు



చిట్యాలలో రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో లాలూస్వామి ఉరుసు సందర్భంగా ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పాలపళ్ల సైజు వృషభాల బండలాగుడు పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన వృషభాలు గెలుపొందాయి. ఉత్సవ కమిటీ సభ్యులు పోటీలను ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో గుంటూరు జిల్లా, కాకుమాను మండలం, కొండబాలవారిపాలెంకు చెందిన జీపీ చౌదరి బుల్స్ (గరుడ, శివుడు) రెండు జతల వృషభాలు మొదటి, రెండవ స్థానాల్లో నిలిచాయి. , మూడవ స్థానంలో కర్నూలు జిల్లా పి.రుద్రవరంకు చెందిన యల్లగౌడ్ వృషభాలు, గుంటూరు జిల్లా కాకుమాను మండలం, మతుకుమల్లికి చెందిన మండ్ర మల్లయ్య, పంచలింగాలకు చెందిన బైరపోగు బుల్స్ వృషభాలు సంయుక్తంగా నాల్గవస్థానంలో, గుంటూరు జిల్లా కొండపాటూరు మండలం కాకాబుల్స్ ఐదవ స్థానంలో నిలిచినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గెలుపొందిన వృషభాల యజమానులకు దాతల సాయంతో వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలను నిర్వాహకులు అందజేశారు. ఉరుసు సందర్భంగా లాలుస్వామి దర్గా సమీపంలో సాయంత్రం కీస్తీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ముగిసిన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



కొలుట్ల చెన్నకేశవస్వామికి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో వెలిసిన భూదేవి, శ్రీదేవి సమేత కొలుట్ల చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఉదయం ఆలయ చైర్మన్ ఆర్.హనుమంతరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి చక్రస్నానం చేయించారు. సాయంత్రం పి.కోటకొండ గ్రామంలో పల్లకీ సేవ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు కరణం చిన్నహనుమంతప్ప, పార్వతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు అన్నదానం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తాగునీటి సౌకర్యం కల్పించారు. దేవనకొండ సీఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చిప్పగిరి: మండలంలోని బెల్డోణ గ్రామం పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం వివస్త్రగా ఉన్న స్థితిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. చనిపోయిన మహిళ వయస్సు 45 నుంచి 50 సంవత్సరాలు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు.

కారు బోల్తా – ఇద్దరికి గాయాలు



గాయపడిన శేషిరెడ్డికి చికిత్స చేస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: కారు అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆలూరు మండలం హులేబీడు గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలు.. మొలగవల్లి గ్రామానికి చెందిన మల్లేశ్వర రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదోనికి వెళ్తుండగా హులేబీడు గ్రామ సమీపంలోని ఎస్ఆర్‌కే క్వారీ మలుపు వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రత్నమ్మ, శేషి రెడ్డి తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి రెఫర్ చేశారు.

మార్కెట్ యార్డులో మోసాలను అరికట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మోసాలను అరికట్టాలని, రైతులను దోచుకుంటున్న కమీషన్ ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపణ్ణగౌడ్, పట్టణ సీపీఐ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మార్కెట్ యార్డ్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యార్డ్ కార్యదర్శి పద్మవతికి అందజేశారు. వారు మాట్లాడుతూ.. యార్డులో దళారి వ్యాపారులు తూకాల్లో మోసం చేస్తున్నారని ఆరోపించారు. దిగుబడులను తక్కువ ధరలకు కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారని, కమీషన్లు అధికంగా తీసుకొనే వ్యాపారుల లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేసి ఆ సంఘ నాయకులు సత్యన్న, బాలరాజులు వినతిపత్రం ఇచ్చారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.